విశాలాంధ్ర ప్రాంతీయం
గుంటూరు, బాపట్ల, పల్నాడు

ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు ఇవ్వండి

సీపీఐ పోరుబాటలో నేతల డిమాండ్

విశాలాంధ్ర, వినుకొండ: జగనన్న ఇళ్ల లబ్ధిదారుల ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు ఇవ్వాలని, టిడ్కో ఇళ్లకు మౌలిక వసతులు ఏర్పాటు చేసి తక్షణమే పంపిణీ చేయాలని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా పట్టణంలోని ఒకటో వార్డులో మంగళవారం పార్టీ నాయకులతో కలిసి 'సీపీఐ పోరు బాట' కార్యక్రమాన్ని ప్రారంభించారు. లబ్ధిదారులను కలిసి అర్జీలపై సంతకాలు సేకరించారు. కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ, ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానం మేరకు, పట్టణాలలో రెండు సెంట్లు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు స్థలం ఇచ్చి ప్రభుత్వమే గృహాలు కట్టివ్వాలని, లేనియెడల ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు ఇవ్వాలనీ, రూ. లక్ష 80 వేలు ఇంటి నిర్మాణానికి ఏమాత్రం సరిపోవని అన్నారు. తాను అధికారంలోకి వస్తే టిడ్కో గృహాలను ఒక్క రూపాయి తీసుకొని అందరికీ ఉచితంగా పంపిణీ చేస్తానని జగన్ వాగ్దానం చేశారని గుర్తు చేశారు. ఆయా గృహాలను ఇంతవరకు పంపిణీ చేయలేదని చెప్పారు.

సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు మాట్లాడుతూ, జీవో నెంబర్ ఒకటి తెచ్చి ప్రజల హక్కులను ప్రభుత్వం కాలరాస్తుందని ఆరోపించారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఉలవలపూడి రాము మాట్లాడుతూ, రాష్ట్రంలో రైతాంగం పరిస్థితి అధ్వానంగా మారిందని అన్నారు. కొనే నాథుడు లేక ధాన్యం దళారులకు అమ్ముకునే పరిస్థితి వచ్చిందని అన్నారు. సీపీఐ నాయకులు పెనిబోయిన వెంకటేశ్వర్లు, బూదాల సాగర్, ఏ. పవన్ కుమార్, షేక్ మస్తాన్, కిషోర్, సాంబయ్య, కె.మల్లికార్జున, నల్లబోతుల శ్రీను, జల్లెల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వినుకొండ పోరు బాటలో పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్, గుంటూరులో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నగర కార్యదర్శి కోట మాల్యాద్రి

టిడ్కో గృహాలు స్వాధీనపరచండి

విశాలాంధ్ర-గుంటూరు: జగనన్న కాలనీ లబ్ధిదారులకు రూ.1.80 లక్షలు బదులు రూ.5 లక్షలు ఇవ్వాలని, టిడ్కో గృహాలను సత్వరమే స్వాధీన పరచాలని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక మల్లయ్యలింగంభవన్‌లో మంగళవారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈ నెల 30వరకు సంతకాల సేకరణ, రౌండ్ టేబుల్ సమావేశం, ఫిబ్రవరి 6న లబ్ధిదారుల్ని సమీకరించి కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం, 22న రాష్ట్రవ్యాప్తంగా లబ్ధిదారులని పెద్దఎత్తున సమీకరించి విజయవాడ నగరంలో మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు వివరించారు. సత్వరమే టిడ్కో గృహాలు లబ్ధిదారులకు స్వాధీనపరచాలని అనేక మార్లు ఉద్యమించినా ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నదన్నారు. రూ.50 వేలు, లక్ష రూపాయలు అప్పు చేసి సొంత ఇంటి కల నెరవేరుతుందని ఆలోచనతో పేద, మధ్యతరగతి ప్రజలు ఆనాటి ప్రభుత్వానికి చెల్లించారని, కానీ జగన్ అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు గడుస్తున్నా వారిని ఇబ్బందిపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇల్లు కట్టించి ఇస్తామని హామీ ఇచ్చి నేడు ఇల్లు కట్టలేని పరిస్థితులలో ప్రభుత్వం తిరిగి స్థలాన్ని స్వాధీన పరుచుకుంటుందని వలంటీర్ల ద్వారా బెదిరింపులకు గురిచేయడం తగదన్నారు. సీపీఐ నాయకులు నూతలపాటి చిన్న, ఆకిటి అరుణ్‌కుమార్, రావుల అంజిబాబు, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

పొన్నూరులో...

వాగ్దానం విస్మరించడం తగదు

విశాలాంధ్ర-పొన్నూరు : జగనన్న గృహాలకు రూ.5 లక్షలు ఇవ్వాలని, టిడ్కో ఇళ్లను వెంటనే లబ్ధిదారులకు స్వాధీనపరచాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ డిమాండ్ చేశారు. సీపీఐ పోరుబాట వాల్ పోస్టర్లను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం పుప్పాల మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో నిర్మాణం చేపట్టి 90 శాతం పూర్తి చేసిన టిడ్కో ఇళ్లను మిగతా 10 శాతం పూర్తి చేసి వెంటనే లబ్ధిదారులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. పేదలందరికీ 30 లక్షల ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తానని, మొదటి విడత 15 లక్షల గృహాలు రెండవ విడత 15 లక్షల గృహాలు ప్రభుత్వమే నిర్మించి ఇల్లు కట్టిస్తుందని ఎన్నికలప్పుడు ఇచ్చిన వాగ్దానాలను అధికారం చేపట్టిన తర్వాత సీఎం జగన్ పూర్తిగా విస్మరించారన్నారు. ఏడుకొండలు, జంపని గోవిందరాజులు, మీలిగల సత్యనా రాయణ, పి.సిద్దు, బి.సుబ్బారావు, కె.సీతారామయ్య, సంతోషరావు, రత్నబాబు, కళ్యాణ్ పాల్గొన్నారు.

తాడికొండలో..

ప్రభుత్వమే గృహాలు నిర్మించాలి

విశాలాంధ్ర-భట్టిప్రోలు : జగనన్న ఇళ్ల లబ్ధిదారులకు రూ.ఐదు లక్షలు ఇవ్వాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పి. నాగాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పేదలందరికీ మొదటి విడత 15 లక్షలు, రెండవ విడత 15 లక్షల గృహాలు ప్రభుత్వమే కట్టిస్తుందని ఎన్నికలప్పుడు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను జగన్ పూర్తిగా విస్మరించారన్నారు. లబ్ధిదారుల కురూ.1.80 లక్షలు మాత్రమే ఇచ్చి మీరే గృహాలను వెంటనే నిర్మించుకోవాలని అధికారులచే బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. బాపట్ల జిల్లా కమిటీ సభ్యులు గొట్టుముక్కల బాలాజీ మాట్లాడుతూ, కలెక్టరేట్ల వద్ద ధర్నాలు, ఫిబ్రవరి 22న నిర్వహించతలపెట్టిన ఛలో విజయవాడ విజయవంతం చేయాలని కోరారు. వేమూరు నియోజకవర్గ కార్యదర్శి బండారు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఓబులశెట్టి రమేష్, టి. రాఘురాంప్రసాద్, గౌస్, బాజ్జి, నాగరాజు, వి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఇక్కట్లు గుర్తించండి

విశాలాంధ్ర-తాడికొండ : జగనన్న ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని సీపీఐ తాడికొండ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ళ శివశంకరరావు కోరారు. తాడికొండ అడ్డరోడ్డు సమీపంలో ఉన్న జగనన్న కాలనీ నిర్మాణ పనులను మంగళవారం పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. ఇంటి నిర్మాణ సామాగ్రి పెరిగిన నేపథ్యంలో లబ్ధిదారులు ఇల్లు నిర్మించుకోలేక ఇక్కట్లకు గురవుతున్నారని అన్నారు. ప్రభుత్వం ఇస్తున్న రూ.1.80 లక్షలు ఏ మేరకు సరిపోతాయని ప్రశ్నించారు. లబ్ధిదారుల ఇక్కట్లను గుర్తించాలన్నారు.

రోహిత్ వేములది మనువాద హత్యే

ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బందెల నాసర్ జీ

విశాలాంధ్ర-గుంటూరు : రోహిత్ వేములది మనువాద హత్యేనని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బందెల నాసర్ జీ అన్నారు.స్థానిక మల్లయ్యలింగంభవన్‌లో రోహిత్ వేముల చిత్రపటానికి ఏఐఎస్ఎఫ్ నాయకులు మంగళవారం పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాసర్ జీ మాట్లాడుతూ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎన్నో ఆశలతో చదువును అభ్యసించి ఉన్నత స్థాయికి వెళ్ళాలని అడుగు పెట్టి అక్కడ మనువాదులకు వ్యతిరేకంగా పోరాడి కులవివక్షకు గురై ఏబీవీపీ, ఆర్ఎస్ఎస్ మతోన్మాద సిద్ధాంతానికి వ్యతిరేకంగా పోరాడి, తనను హాస్టల్ నుంచి సస్పెండ్ చేసిన కూడా ఆత్మస్థైర్యం కోల్పోకుండా భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ స్ఫూర్తితో దీక్షకు కూర్చొని చివరికి మనువాదుల వల్ల ఆత్మహత్య చేసుకొని ప్రాణాలను కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంట్‌లో అనేకమంది ఎంపీలు రోహిత్ ఆత్మహత్యపై గళం ఎత్తినప్పటికి 7 సంవత్సరాలు అవుతున్న కూడా ఆ కుటుంబానికి న్యాయం జరగలేదని కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. మనువాదం, కులవివక్షత, మతోన్మాదం ఉన్నాయని వాటికి వ్యతిరేకంగా అఖిల భారత విద్యార్థి సమాఖ్య పోరాటాలను నిర్వహిస్తుందని తెలిపారు. ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి యశ్వంత్, సాయి, అమరనాథ్, లీలా, వెంకట్ సాయి, అజయ్ పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర, తెనాలి : సంక్రాంతి సందర్భంగా వైకుంఠపురంలోని వేంకటేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో స్వామివారి తెప్పోత్సవం నిజాంపట్నం కాలువలో నిర్వహించారు. తొలుత తెప్పోత్సవాన్ని సి.ఐ. చంద్రశేఖర్ ప్రారంభించారు. అర్చకులు సత్యన్నారాయణ, గౌతమ్ అళహరి, రవికుమార్‌లు పూజలు నిర్వహించారు. కొత్తవంతెన, మార్కెట్ వంతెన, గంగానమ్మపేట వంతెనల వద్ద భక్తులు స్వామివారిని విశేషంగా దర్శించుకున్నారు. సబ్ డివిజనల్ పోలీస్ కార్యాలయం వద్ద డియస్‌పి స్రవంతిరాయ్ పూజలు చేశారు. ఆలయ ఇ.ఓ. తిమ్మానాయుడు పర్యవేక్షించారు. బాలాజీరావుపేట అయ్యప్ప ఆలయంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు దుర్భా హరిబాబు అభిషేకాలు చేశారు. కొల్లిపర కళానిలయం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. వైయస్ఆర్ సిపి రాష్ట్ర కార్యదర్శి గుదిబండి చినవెంకట రెడ్డి , సంగీత దర్శకులు బొల్లిముంత కృష్ణ , చిన వెంకటరెడ్డి, , జొన్నల అమ్మిరెడ్డి, బొమ్మారెడ్డి ప్రభాకరరెడ్డి, అన్నవరపు రమేష్, గుదిబండి మహేశ్వరరెడ్డి, వంగా లక్ష్మారెడ్డి, కొల్లి పూర్ణారెడ్డి విజేతలకు బహుమతులను అందజేశారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

విశాలాంధ్ర, తెనాలి : వైయస్ఆర్ సిపి యువనాయకుడు షేక్ గౌస్ ఆధ్వర్యంలో షేక్ పెద్ద ఖాజావలి వర్ధంతి సభ మంగళవారం జరిగింది. నియోజకవర్గ శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్.. ఖాజావలి సేవలు వివరించారు. తండ్రి జ్ఞాపకార్థం కుమారుడు షేక్ గౌస్ పేదలకు నిత్యావసర సరుకులను శివకుమార్ చేతుల మీదుగా అందజేశారు.

'మెడికల్' విద్యార్థికి సాయం

విశాలాంధ్ర, వినుకొండ: బొల్లాపల్లి మండలం ముగాచింతలపాలెం పంచాయతీ పరిధిలో గంగులపాలెంకు చెందిన మాదినేని నాసరయ్య 2022 నీట్‌లో ర్యాంక్ సాధించి వైజాగ్ ఆంధ్ర మెడికల్ కళాశాలలో మెడికల్ సీట్ సాధించాడు. మాజీ శాసనసభ్యులు జీ.వీ ఆంజనేయులు మంగళవారం విద్యార్థిని అభినందించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. నాగేశ్వరరావు, జరపాల గోవిందు నాయక్, పెసల వెంకటనారాయణ, ఆళ్ల మన్నయ్య, కాట్ల సుబ్బయ్య, బాబు, ప్రభు,వెంకట కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

పప్పుల దేవదాసు సేవలు చేరువ కావాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: తెలుగుదేశం పార్టీ కార్యకర్తలపై నిరంతరాయంగా జరుగుతున్న పోలీసుల అరాచకాలు, అక్రమ అరెస్టుల నుండి రక్షణ కల్పిస్తున్న న్యాయ వ్యవస్థలోకి నూతనంగా అడుగుపెట్టిన పప్పుల దేవదాసు సేవలు పార్టీకి మరింత చేరువు కావాలని జిల్లా టిడిపి అధ్యక్షులు తెనాలి శ్రావణ్ కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నూతనంగా న్యాయవాద వృత్తిలోకి ప్రవేశించిన టీడీపీ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షులు పప్పుల దేవదాసుని సన్మానించారు. ఈ సందర్భంగా శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ 64 సంవత్సరాల వయస్సులో కష్టపడి న్యాయ శాస్త్రము నందు పట్టాను పొంది బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు నందు అడ్వకేట్‌గా నమోదు పొంది గుంటూరు బార్ అసోసియేషన్ మెంబెర్‌గా న్యాయవృత్తిలో ప్రవేశించిన వారికి అభినందనలు తెలిపారు. కంచర్ల శివరామయ్య, కూనంనేని వెంకటరమణ, మద్దిరాల గంగాధర్, బొబ్బిలి రామారావు తదితరులు పాల్గొన్నారు.

కోనేటిపురం దేవస్థానంకు ఇత్తడి తొడుగు సమర్పణ

విశాలాంధ్ర-భట్టిప్రోలు : మండలంలోని కోనేటిపురం గ్రామంలో పునర్నిర్మితమైన శ్రీ వెంకటేశ్వర సుబ్రహ్మణ్యేశ్వర దేవస్థానంలో వేంచేసియున్న సుబ్రహ్మణ్యస్వామికి రేపల్లెకు చెందిన మానేపల్లి వెంకట శివనాగేశ్వరరావు - అనురాధ దంపతులు ఇత్తడి తొడుగును బహుకరించారు. మహా సంప్రోక్షణ అనంతరం స్వామివార్లకు ఇత్తడి తొడుగును మంగళవారం అలంకరించారు. కుటుంబ సభ్యులు పొన్నూరు హరిహరనాథ్ - రమ్యశ్రీ దంపతులచే శాస్త్రయుక్తంగా జరిపించారు.

ఆంజనేయుడికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-పెదకూరపాడు రూరల్ : మండల పరిధిలోని హుస్సేన్‌నగరం గ్రామంలో మంగళవారం వేద పండితులు జ్యోతిష్కులు శ్రీపతి బాలకృష్ణ చారి ఆధ్వర్యంలో సుబ్రమణ్య స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగూరి భద్రయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం శ్రీ ప్రసన్నాంజనేయ స్వామికి వెండి మకర తోరణం సమర్పించారు. విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ప్రసన్నాంజనేయ స్వామికి ప్రత్యేక అలంకరణలో భక్తులకు స్వామి దర్శనం ఇచ్చారు.

పేదలకు రగ్గుల పంపిణీ

విశాలాంధ్ర-పొన్నూరు : సంక్రాంతి కనుమ సందర్భంగా పీపుల్స్ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో అధ్యక్షులు గూడవల్లి గంగాధర్ నిడుబ్రోలు ఎస్టీ కాలనీలో పేదలకు రగ్గులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మెరుగుల సతీష్, రత్నకుమార్, ఆడిటర్ సుబ్బారావు, అరవింద్, దినేష్ పాల్గొన్నారు.

పోరు ఆగదు: జంగాల

విశాలాంధ్ర-గుంటూరు : లబ్ధిదారుల ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇచ్చే వరకు తమ పోరాటం ఆగదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ స్పష్టం చేశారు. రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా నగర సమితి ఆధ్వర్యంలో లాం ప్రాంతంలో లబ్ధిదారులకు కేటాయించిన ఇళ్ళ స్థలాలను సీపీఐ బృందం మంగళవారం పరిశీలించింది. అనంతరం లబ్ధిదారుల నుంచి సంతాలు సేకరించింది. ఈ సందర్భంగా జంగాల మాట్లాడుతూ, లాం ప్రాంతంలో ఇళ్ల స్థలాలు 10 అడుగుల లోతులో క్వారీలో కేటాయించడం జరిగిందని అన్నారు.పునాదులకే రూ.2 లక్షలు, ఇళ్ళు నిర్మించుకోవడానికి సుమారుగా రూ.12 లక్షలు ఖర్చు అవుతుందని అన్నారు. కేవలం రూ.1.80 లక్షలలో ఇల్లు నిర్మించడం అసాధ్యమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏ కాలనీలో కూడా పట్టుమని నాలుగు ఇళ్ళు పూర్తి కానీ దృశ్యాలు కనబడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో లబ్ధిదారులందరినీ చైతన్యపరుస్తామన్నారు. ఇల్లు నిర్మించుకోకపోతే స్థలాలు వెనక్కి తీసుకుంటామని బెదిరించడం హేయమైన చర్య అని అన్నారు. సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ, గుంటూరు నగరంలో 73 వేల మంది జగనన్న ఇంటి లబ్ధిదారులు ఉన్నారని, కానీ కనీసం 25 ఇళ్ళు కూడా పూర్తి కాలేదని అన్నారు. చివరి దశలో ఉన్న టీడ్కో ఇళ్ల పనులను పూర్తి చేసి లబ్ధిదారులకు ఇల్లు స్వాధీనపరచాలని డిమాండ్ చేశారు. గుంటూరు నగరంలో సుమారు 7472 మంది టిడ్కో లబ్ధిదారులు రూ.50 వేల నుంచి లక్ష రూపాయాల వరకు కట్టి గత నాలుగు సంవత్సరాలుగా అద్దెలు చెల్లించలేక తెచ్చిన అప్పుకు వడ్డీలు కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సీపీఐ నగర కమిటీ సభ్యులు ఆకిటి అరుణ్ కుమార్, రావుల అంజిబాబు, చల్లా మరియదాసు, చిన్న పోతుల విజయకుమార్, నూతలపాటి చిన్న, నగర సమితి సభ్యులు బందెల నాసర్ జీ, జంగాల చైతన్య, జగన్నాథం, పున్నయ్య, రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

జూదాలు ప్రోత్సహించి కోట్లు దండుకున్న జగన్

మాజీ ఎమ్మెల్యే ఆంజనేయులు

విశాలాంధ్ర, వినుకొండ: సంక్రాంతి పండుగ సందర్భంగా విశాఖ నుంచి విజయనగరం వరకు వందల ఎకరాల్లో పెద్దపెద్ద గుడారాలు ఏర్పాటుచేసి జూదాలు, క్యాసినోలు ప్రోత్సహించి కోట్ల రూపాయలు జగన్ దండుకున్నారని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆరోపించారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పండుగపూజ ప్రజలను ఆదుకోవాల్సిన ప్రభుత్వం, జూదాలను ప్రోత్సహించడం సిగ్గుచేటు అన్నారు. రాష్ట్రంలో కల్తీ మద్యం తాగి అనేకమంది మరణిస్తూ ఆయా కుటుంబాలు వీధిన పడుతున్నాయని, జగన్ ప్రభుత్వం ప్రజారోగ్యంతో చెలగాటమాడుతుందని విమర్శించారు. రైతుల పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక రైతాంగం అప్పుల్లో కూరుకుపోయిందని, ఆదుకోవాల్సిన ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్‌లకు మరమ్మత్తులకు నిధులు లేక ఎత్తివేసే పరిస్థితి నెలకొందని అన్నారు.

ముగ్గుల పోటీలు అడ్డుకున్న వైసీపీ

శావల్యాపురం మండలం ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సొంత ఊరు వేల్పూరు గ్రామంలో సంక్రాంతి ముగ్గుల పోటీలను అడ్డుకోవడం దుర్మార్గమని ఆంజనేయులు అన్నారు. టీడీపీ ఆధ్వర్యంలో గ్రామ వాసులు ముగ్గుల పోటీలు జరుపుకుంటుంటే జీర్ణించుకోలేని వైసిపి ఉద్దేశపూర్వకంగా పోలీసులు అడ్డుపెట్టుకొని ఆపివేయటం నీచమైన చర్య అన్నారు. ఇటువంటి నీచ సంస్కృతికి ప్రజలు త్వరలో బుద్ధి చెప్పటం ఖాయమని అన్నారు. ఈ సమావేశంలో నాగేశ్వరరావు, జరపాల గోవిందు నాయక్, పళ్ళ మీసాల దాసయ్య, ఆకుమల్ల కాసిం, వీరాంజనేయరెడ్డి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వెంటనే పూర్తి చేయాలి



విశాలాంధ్ర-తాడికొండ: లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి కోరారు. మంగళవారం తుళ్ళూరు మండలంలోని పెదపరిమి గ్రామంలో పేదలందరికీ ఇళ్ళ పథకం లే అవుట్‌లో ఇళ్ళ నిర్మాణాలు పరిశీలించి, గ్రామ సచివాలయంను, ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని, రైతు భరోసా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెదపరమి గ్రామంలోని పేదలందరికీ ఇళ్ళ పథకం లే అవుట్‌లో ఇళ్ళ నిర్మాణాలను పరిశీలించి, లబ్ధిదారులు, అధికారులతో కలెక్టర్ సమావేశమై మాట్లాడారు. ఈ నెల 31 నాటికి లే అవుట్ లోని ఇళ్ళు నూరు శాతం బేస్మెంట్ లెవల్‌కు తీసుకువచ్చేలా సచివాలయ ఉద్యోగులు లబ్ధిదారుల ఇంటింటికి వెళ్ళి పనులు వేగవంతం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఇసుక, సిమెంట్, ఇనుము లే అవుట్‌లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. హౌసింగ్ అధికారులను సమన్వయం చేసుకుంటూ మండలస్థాయి, ప్రత్యేక అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూండాలన్నారు.

గడప గడపకు మన ప్రభుత్వంలో మంజూరైన నాణ్యతతో నిర్దేశిత సమయంలో పూర్తి అయ్యేలా ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పనులను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పీఎంకిసాన్ పథకంకు ఈకేవైసీ వెంటనే పూర్తి చేయించాలని, రబీ పంట ఈ క్రాప్‌లో నమోదు చేయాలన్నారు. ఆరోగ్య కేంద్రం పరిధిలో ప్రతి నెల జరుగుతున్న డెలివరీ సంఖ్య, టీబీ ముక్త్ కార్యక్రమం, ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలు జరుగతున్న తీరును ఏఎన్ఎంల ద్వారా కలెక్టర్ తెలుసుకున్నారు.హౌసింగ్ పీడీ సాయినాథ కుమార్, ఈఈ శంకరరావు, ఎఈ గోపీ, ఎంపీడీవో శ్రీనివాసరావు, తహశీల్దారు బిజె ప్రభాకర్, ఎలక్ట్రికల్ ఏఈ చిలక నాగరాజు, వ్యవసాయ శాఖ ఏవో శ్రీరంజని, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సచివాలయ మండల కన్వీనర్‌గా మాగులూరి

విశాలాంధ్ర-పెదకూర పాడు రూరల్ : సచివాలయ కన్వీనర్లు, గృహ సారధులు, వలంటరీలు అందరూ నాయకులు ప్రజలతో సమన్వయంతో, కలుపుకొని పనిచేయాలని పెదకూరపాడు నియోజకవర్గ శాసనసభ్యులు నంబూరు శంకరరావు అన్నారు. నూతనంగా సచివాలయం మండల కమిటీ కన్వీనర్‌గా ఎన్నికైన మాగులూరి అనిల్ కుమార్‌ను అభినందించారు. ఈ సందర్భంగా మాగులూరి అనిల్ కుమార్ ఎమ్మెల్యే నంబూరు శంకరరావులను సత్కరించారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని, వైసీపీ అభివృద్ధికి కృషి చేస్తామని, ప్రజలతో మమేకమై ప్రభుత్వం అధికారులతో పనిచేసేలా బాధ్యతగా పనిచేస్తానని అనిల్ అన్నారు. ఈ పదవికి సహరించిన మండల వైసీపీ నాయకత్వానికి అభినందనలు తెలిపారు.

కారుమంచి సంఘం డైయిరి అధ్యక్ష ఎన్నిక వాయిదా

విశాలాంధ్ర-శావల్యాపురం: అనివార్య కారణాల చేత కారుమంచిలోని పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్ష ఎన్నిక వాయిదా వేసినట్లు ఎన్నికల అధికారి నాదెండ్ల రామకృష్ణ మంగళవారం తెలిపారు.

బల్లకట్టు నిలిపివేత



విశాలాంధ్ర-మాచవరం: గోవిందపురం సమీపంలో అనుమతి లేకుండా తిప్పుతున్న బలకట్టను నిలిపివేసినట్లు మాచవరం ఎస్సై కోటయ్య మంగళవారం తెలిపారు. గురజాల డి.ఎస్.పి ప్రసాద్ జనరల్ విజిట్‌లో భాగంగా మంగళవారం మాచవరం పోలీస్ స్టేషన్ సందర్శించి కృష్ణానది పరివాహ ప్రాంతాలైన గోవిందపురం పరిసర ప్రాంతాలను పరిశీలిస్తూ కృష్ణ నదిపై తెలంగాణ వైపు నుండి అనుమతి లేకుండా తిప్పుతున్న బల్లకట్టను నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేయడం జరిగిందని ఎస్సై తెలిపారు. ఎవరైనా జూదం, పేకాట, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహిస్తే సహించేది లేదని తెలియజేశారు. సమాచారం అందించేవారి పేర్లు గోప్యంగా ఉంచుతామని ఎస్సై తెలియజేశారు.

రీ సర్వే వేగవంతం చేయాలి

విశాలాంధ్ర, ప్రత్తిపాడు : వై. యస్. ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు ,భూ రక్ష రీ సర్వే వేగవంతం చేయాలని సంయుక్త కలెక్టర్ రాజ్ కుమారి పేర్కొన్నారు. స్థానిక ప్రత్తిపాడు తాసిల్దార్ కార్యాలయంలో మంగళవారం జిల్లా , మండల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లాలోని మొత్తం 31 గ్రామాలకు రీ సర్వే చేయాల్సి ఉండగా, మొదట విడతలో 5 గ్రామాలు రీ సర్వే జరిగి భూ హక్కు పత్రాలు పంపిణీ చేయటం జరిగిందన్నారు. మేడికొండూరు మండలములో 10, పట్టిచెరుకూరులో 13, ప్రత్తిపాడులో 2, దుగ్గిరాల మండలములో ఒక గ్రామంలో సర్వే చేయాల్సి ఉందన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ శివన్నారాయణ శర్మ, డిప్యూటీ కలెక్టర్ భాస్కర్ నాయుడు, తహసీల్దారు యం. లీలా సంజీవ కుమారి , ఇంచార్జి ఎస్ ఎల్ ఓ సిహెచ్. మల్లికార్జున రావు , సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు ప్రారంభం

విశాలాంధ్ర-దుర్గి : మండలంలో ఉపాధి పనులు ప్రారంభమయ్యాయని, ఏపీఓ జి.చిన వెంకటేశ్వర్లు తెలిపారు. ఓబులేశు నిపల్లె వడ్డేరి కుంటలో జరుగుతున్న పూడికతీత పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. మొత్తం 602 మంది కూలీలు పాల్గొన్నారనీ, కుంటలు, కాల్వల్లో పూడికతీత పనులు జరుగుతున్నాయన్నారు. ఆయన వెంట టెక్నికల్ అసిస్టెంట్ మల్లికార్జున ఉన్నారు.

ఇంగ్లాండ్ బృందం.. ప్రకృతి వ్యవసాయ పంటల పరిశీలన

విశాలాంధ్ర-ఫిరంగిపురం: అమీనాబాదు క్లస్టర్‌కు సంబంధించి మండలంలో 113తాళ్ళూరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పంట పొలాలను గుంటూరు జిల్లా ప్రకృతి వ్యవసాయ డి.పి.యం.రాజకుమారి ఆధ్వర్యంలో ఇంగ్లాండ్ నుంచి రెయిన్ ఫారెస్ట్ టీమ్ సభ్యుల బృందం వారు మాథ్యాస్ ఫోర్ట్, వినూత్న టీమ్ సభ్యుల బృందం మంగళవారం పొలాలను పరిశీలించారు. మిరప పంటలో అంతర్ పంటలుగా ఉల్లి,పసుపు ,క్యాబేజీ, క్యాలీఫ్లవర్, మినుము. సరిహద్దు పంటలుగా జొన్న, మొక్కజొన్న, సజ్జ, ఎర పంటలుగా బంతి, ఆముదం మొదలగు పంటలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మిరప అంతర్ పంటలు, సరిభద్దు పంటలు పసుపు తెలుపు పళ్ళాలు, లింగాకర్షణ బుట్టలు ఉపయోగాలు గరించి రాజకుమారి వివరించారు. ప్రత్తిలో ఆర్.డి.యస్(రబీ డ్రై సోయింగ్) వేయడం వలన కలిగే ఉపయోగాలు తెలియ జేశారు. ఘన, ద్రవ, జీవామృతాల తయారీని ప్రాక్టికల్‌గా చేసి చూపించారు. గుంటూరుజిల్లా మార్కెటింగ్ ఇంచార్జి మల్లేశ్వరి, ఎం.టి. వీరలక్ష్మీ, ఎస్.డి.ఎన్నామణి, సీనియర్ ఐసిఆర్‌పిఇర్ల వెంకటేశ్వర్లు, ఐసిఆర్‌పీలు లక్ష్మారెడ్డి, గాయత్రి, అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వర్ధంతి సభకు పెద్ద సంఖ్యలో నాయకులు హాజరవ్వాలి

విశాలాంధ్ర-ఫిరంగిపురం: సినీనటుడు నట సార్వభౌముడు తెలుగుదేశంపార్టీ వ్యవస్థాపకులు మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 27వ వర్ధంతి సభకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంతాప సభను విజయవంతం చేయాలని మండల టిడిపి అధ్యక్షులు మండవ నర్సింహారావు ఒక ప్రకటనలో కోరారు. స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద బుధవారం కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని సభలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ ప్రజలకు చేసిన జనరంజక పరిపాలన గురించి అన్న ఎన్టీఆర్ జీవిత చరిత్ర గురించి వక్తలు ప్రసంగిస్తారన్నారు. ఫిరంగిపురం , కండ్రిక గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని గుంటూరు జిల్లా పార్టీ అధ్యక్షులు తెనాలి శ్రావణ్‌కుమార్ ఆవిష్కరణ చేస్తారని నర్సింహారావు చెప్పారు.

కాంగ్రెస్‌కు పూర్వవైభవం తెస్తాం

పీసీసీ అధ్యక్షుడు రుద్రరాజు

విశాలాంధ్ర-బాపట్ల టౌన్ : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవాన్ని తీసుకునివచ్చేందుకు గ్రామ, పట్టణ, నగర, జిల్లా స్థాయిలలో పార్టీని బలోపేతం చేసేందుకు ప్రత్యేక సమావేశాలు, కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పీసీసీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు పేర్కొన్నారు. జిల్లా పర్యటన సందర్భంగా పట్టణంలోని బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు గంటా అంజిబాబు నివాసం వద్ద మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కేడర్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించి నియమకాలను చేపట్టారు. బాపట్ల అధ్యక్షులుగా శంకర్ రెడ్డికి పార్టీ బాధ్యతలు అప్పగించారు. మైనార్టీ సెల్ నుంచి అజీమ్‌కు పార్టీ కండువా కప్పి రుద్రరాజు స్వాగతం పలికారు. పెద్దఎత్తున మహిళలు, నాయకుల చేరికతో కాంగ్రెస్ పార్టీ బలోపేతం అయిందని బాపట్ల పార్లమెంటు అధ్యక్షులు గంటా అంజిబాబు తెలియజేశారు. రుద్రరాజును దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. గిడుగు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ప్రజలకు ఉన్న అపనమ్మకాన్ని పోగొట్టేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అన్ని విభాగాల్లో కూడా కార్యకర్తలను, నాయకులను సిద్ధం చేసి పార్టీని బలోపేతం చేస్తామని అన్నారు. మాజీ శాసనసభ్యులు షేక్ మస్తాన్ వలి, పట్టణ అధ్యక్షులు ధోనిపూడి దేవరాజ్, సేలం సాగర్, దోనుపూడి రవిబాబు, పటాన్ రాజేష్, దండు రేణుక, కట్ట లాజర్, రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఇన్నోవేటివ్ యూనివర్సిటీ-2022' గా ఎపీ ఎస్ఆర్ఎం

విశాలాంధ్ర-మంగళగిరి: ఏపీ ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయానికి 'ఇన్నోవేటివ్ యూనివర్సిటీ ఆఫ్ ది ఇయర్ 2022' గా గుర్తింపు లభించింది. బెంగళూరు కేంద్రంగా ప్రచురితమవుతున్న అకడమిక్ ఇన్సైట్స్ మేగజైన్ యాజమాన్యం దీన్ని ప్రకటించింది. ఉన్నత విద్యారంగంలో సాధించిన ప్రగతి, నూతన ఆవిష్కరణలకు గుర్తింపుగా ప్రయివేటు విశ్వవిద్యాలయాల కేటగిరీలో ఏపీ ఎస్ఆర్ఎంను ఎంపిక చేసినట్లు మేగజైన్ ప్రకటించింది. ఏటా విశ్వవిద్యాలయాల పనితీరును విశ్లేషించి ఉత్తమ యూనివర్సిటీలకు ఈ మేగజైన్ వివిధ కేటగిరీలలో ప్రత్యేక గుర్తింపును ఇస్తుందనీ, ఇందులో భాగంగా 2022 విద్యా సంవత్సరానికి గాను ఉత్తమ సృజనాత్మక విశ్వవిద్యాలయంగా ఏపీ ఎస్ఆర్ఎం ఎంపికైనట్లు కమ్యూనికేషన్స్ డైరెక్టర్ పంకజ్ బల్వేరియర్ పేర్కొన్నారు.

గొడవలు సృష్టించి...

విశాలాంధ్ర, వినుకొండ: సంక్రాంతి పండగను ప్రజలంతా అంగరంగ వైభవంగా జరుపుకున్నారని శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. పట్టణంలోని తన నివాస గృహంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు గ్రామాలలో గొడవలు సృష్టించి విభజించి పాలించిన సూత్రాన్ని పాటిస్తున్నారని అన్నారు. వేల్పూరులో ఇద్దరు కుర్ర కారు చేసుకున్న గొడవలను పార్టీలకు అంటగడుతున్నారని ఎద్దేవా చేశారు. సీఎం గజన్ పాలనలో ప్రజలు సుఖసంతోషాలతో ఆనందంగా ఉంటే బురద చల్లే ప్రయత్నాలు చేస్తున్నారని, పేకాటలు క్యాసినోలు కోడిపందాలు ఆది నుంచి ఆడిస్తున్నది ఎవరనే విషయం ప్రజలందరికీ తెలుసు అని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో ప్రతిపక్షాలకు ఒక్క సీటు వచ్చే పరిస్థితి లేదని, ఒంటరిగా పోటీ చేసే ధైర్యం జనసేన నాయకుడు పవన్ కళ్యాణ్ ఉందా అని ప్రశ్నించారు. పార్టీలకతీతంగా సంక్రాంతికి ముందే మున్సిపాలిటీ వారు అందరి ఫ్లెక్సీలను తీసివేస్తే దానిని కేవలం ఎన్టీఆర్ వర్ధంతి కారణంగా ఫ్లెక్సీలు తీసేసారని చెప్పడం బాధాకరమని అన్నారు. పది సంవత్సరాలు అధికారంలో ఉండి లిఫ్ట్ ఇరిగేషన్ ఎక్కడ తీసుకొచ్చారో చూపాలన్నారు. వేల్పూరు గ్రామంలో ఆరు కోట్లతో కోల్డ్ స్టోరేజీ , 1000 మెట్రిక్ టన్నుల గోడౌన్, సబ్‌స్టేషన్, రోడ్లు ఘనత తమ పార్టీ దేనిని పేర్కొన్నారు. బొల్లా రమేష్ గంధం బాలిరెడ్డి పాల్గొన్నారు.

పీకల వాగులో వ్యర్థాలు తొలగించాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : నివాస గృహాల మధ్యగా పెద్ద ఎత్తున మరుగునీరు పారుదలవుతున్న పీకలవాగులో వ్యర్థాలు తొలగించాలని ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎమ్మెల్యే ముస్తఫా ఏటుకూరురోడ్డులోని డీఎస్ నగర్, ఆర్.అగ్రహారం, నిమ్మలపేట, చెంచుకాలనీల్లో పర్యటించారు. స్థానికుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయా ప్రాంతాల్లో నివాస గృహాల మధ్యగా ఉన్న పీకలవాగులో వ్యర్థాలు పెద్ద ఎత్తున ఉండటంతో మురుగునీరు పారుదల కాకుండా నిల్వ ఉంటున్నాయన్నారు. దీంతో స్థానికంగా తాము ఇబ్బందులు పడుతున్నట్టు ఎమ్మెల్యే తెలియజేశారు. అదేవిధంగా డీఎస్ నగర్‌లో ఇళ్ళమధ్య ఖాళీ స్థలాలు ఉండటంతో పిచ్చెట్లు, వ్యర్థాలు నిల్వ ఉంటున్నాయని స్థానికులు చెప్పటంతో ఖాళీ స్థలాలను శుభ్రపరిచి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని శానిటరీ అధికారులను ఆదేశించారు. నిమ్మలపేట, చెంచుకాలనీలో కూడా స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించటానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్పొరేటర్ వేముల జ్యోతి పద్మజ శ్రీనివాస్, శ్రీనివాసరెడ్డి, అచ్చిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్త విధానాలతో ఇబ్బందులు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఫ్యామిలీ సర్టిఫికెట్స్ పొందే విషయంలో రాష్ట్ర ప్రభుత్వ అధికారుల అస్తవ్యస్త విధానాల వల్ల అనేకమంది ఇబ్బందులకు గురవుతున్నారని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తంచేశారు. జీఓ 145ను సవరించాలంటూ హైకోర్టు కీలక ఆదేశాలివ్వటం చాలా మందికి ఊరటనిస్తుందన్నారు. ప్రాథమికంగా దరఖాస్తు చేసిన వ్యక్తి ఆ ఫ్యామిలీ మెంబరా? కాదా? అనే విషయమై సర్టిఫికెట్ ఇవ్వటానికి నెలల తరబడి మండల రెవెన్యూ ఆఫీసులు, సిబ్బంది చుట్టూ తిరగాల్సి వస్తుందని దుయ్యబట్టారు. క్షేత్రస్థాయి పరిశీలనలో వెంటనే తెలిపోయే అంశాన్ని జీఓను మామూళ్ళను అడ్డంపెట్టుకుని అధికారులు, సిబ్బంది వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. జీఓ 145కి సవరణ చేయాలని, సవరణ ఉత్తర్వులు తహాశీల్దార్లకు పంపాలని ఇచ్చిన హైకోర్టు ఆదేశాలను అధికారులు, ప్రభుత్వం శిరసా వహించాలని అవగాహన సంస్థ విజ్ఞప్తి చేస్తుందన్నారు.

ద్విచక్ర వాహన అపహరణకు యత్నం

విశాలాంధ్ర-తాడేపల్లి : ఉండవల్లి కుమ్మరి గుంట వద్ద నివాసం ఉంటున్న వేమ అనిల్ అనే వ్యక్తి తన ఇంటి ముందు పార్క్ చేసిన పల్సర్ 220 వాహనం గత అర్థరాత్రి 12 గంటల సమయంలో అపహరించాలని దొంగలు యత్నించారు. అటుగా పని ముంగించుకుని ఇంటికి వస్తున్న యువకుడు గమనించి కేకలు వేయగా ద్విచక్రవాహనం అక్కడ వదిలేసి ద్విచక్రవాహనంపై ముగ్గురు దుండగులు పారిపోయారు. తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో బాధితుడు వేమ అనిల్ ఫిర్యాదు చేశారు.

రైతుల సమక్షంలో సర్వే నిర్వహించాలి

విశాలాంధ్ర-తాడేపల్లి : రీ సర్వే చేస్తున్న ఇప్పటం గ్రామంలో రైతులతో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు, మండల కార్యదర్శి ఎం.శ్రీనివాసరెడ్డి, కె.శివన్నారాయణ, శివ శంకర మంగళవారం రైతులతో మాట్లాడారు. గ్రామసభలు జరిపి ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతులలో అవగాహన పెంచి రైతుల సమక్షంలో సర్వే నిర్వహించాలని కోరారు.

యాచకులకు దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర-మంగళగిరి : లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వద్ద మంగళవారం భగీరథ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో యాచకులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావు మాట్లాడుతూ చలికాలంలో యాచకులు చలికి ఇబ్బందులు పడుతున్నారని గుర్తించి 25 మందికి దుప్పట్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. జుట్రూ ఏడుకొండలు, కర్నాటి శివ సత్యనారాయణపాల్గొన్నారు.

విశాఖ ఉక్కును కాపాడుకుందాం

- 23 నుంచి దీక్షలు, నిరసనలు - సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు శ్రీధర్, శ్యామ్యూల్

విశాలాంధ్ర - బాపట్ల : విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత మనందరిపై ఉందని సీపీఐ జిల్లా నాయకుడు జేబీ శ్రీధర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శ్యామ్యూల్ పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ కార్యాలయంలో మంగళవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 27న విశాఖలో జరిగే కార్మిక మహా గర్జనకు మద్దతుగా 23,24 తేదీల్లో రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల వద్ద దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. 25న కలెక్టరేట్ వద్ద నిరసనలు కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. 32 మంది ప్రజల బలిదానాలతో 26 వేల మంది రైతుల త్యాగాలతో 67 మంది శాసనసభ్యులు, ఏడుగురు పార్లమెంటు సభ్యులు రాజీనామాలతో విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదంతో సాధించుకున్నామన్నారు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు మద్దతు లేకపోయినా గనులు కేటాయించకపోయినా నిర్విఘ్నంగా సాగుతుందన్నారు. లక్ష మందికిపైగా ఉపాధి చూపిస్తూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు 50 వేల కోట్ల పన్నులు చెల్లిస్తుందన్నారు. కేవలం రూ.5 వేల కోట్ల కేంద్ర మూలధనంతో ఇంత స్థాయికి ఎదిగిన పరిశ్రమను రాష్ట్ర అభివృద్ధిలో కీలక భూమిక పోషిస్తున్న సంస్థను బీజేపీ ప్రభుత్వం ప్రైవేటీకరిస్తానని చెప్పటం బాధాకరం అన్నారు.

రాష్ట్రంలో ఉన్న ఏకైక భారీ పరిశ్రమ తెలుగు ప్రజల భావోద్వేగాలతో బలి దానాలతో నిర్మితమై ఉక్కు ఉత్పత్తిలో దేశంలోనే మన్నికైనా, నాణ్యమైన ఫ్యాక్టరీని ప్రభుత్వం రంగంలోనే నిలబెట్టుకోవడానికి రెండు ఏళ్లుగా విశాఖ ఉక్కు కార్మికులు నిర్వాసితులు రాష్ట్రంలోని అన్ని తరగతులు విభాగాల ప్రజలు రాజకీయ పార్టీలు ప్రజా సంఘాలు ఉద్యమాలు పోరాటాలు చేస్తున్నారన్నారు. దుర్మార్గమైన ఏకపక్ష నియంతృత్వ పోకడకు కార్పొరేట్ కంపెనీలైన పోస్కో ఆదాని అంబానీలకు లాభాలు చేకూర్చటానికి ప్రజల ఆస్తులను తెగనమ్మే చర్యకు చరమగీతం పాడటానికి 27న విశాఖలో లక్ష మందితో కార్మిక మహా గర్జన తలపెట్టారాన్నారు. బిజెపి ప్రభుత్వంపై రణభేరి మోగించడానికి 26 జిల్లాల్లో ఈ నెల 23, 24 తేదీలలో అన్ని రెవెన్యూ డివిజనల్ కేంద్రాల్లో సామూహిక దీక్షలు కొనసాగించాలని 25న జిల్లా కలెక్టర్ ఆఫీసు ఎదుట పెద్ద ఎత్తున నిరసనలు, ధర్నాలు వేలాది మందితో నిర్వహించాలని ఏఐటీయుసి రాష్ట్ర సమితి పిలుపునిచ్చిందన్నారు. కార్మికులు ఇతర ప్రజా సంఘాలు రాజకీయ పక్షాలు పాల్గొని కేంద్ర ప్రభుత్వ కళ్లు తెరిపించాలని కోరారు.

అనంతరం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎం అశోక్, ఏసు రత్నం, రాంబాబు, సీతారామయ్య ,మురళి, రంగారెడ్డి, సుబ్బారెడ్డి, ఎలమంద,జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

మిల్లర్ల వద్దకే ధాన్యాన్ని చేర్చాలనడం దారుణం

ఏపీ రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి రాము

విశాలాంధ్ర, వినుకొండ: మిల్లర్ల వద్దకు ధాన్యాన్ని చేర్చాలని ప్రభుత్వం చెప్పడం దారుణమని ఏపీ రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము అన్నారు. సంఘ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యాన్ని మండలాలకు లేదా నియోజకవర్గాల వరకు మాత్రమే చేరుస్తారు తప్ప వందల కిలోమీటర్లు చేర్చమనటం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. చివరి బస్తా వరకు కల్లాల వద్దే కొనుగోలు చేస్తామని ప్రభుత్వం చెప్పిందనీ, అయితే కొనుగోలు చేసిన తర్వాత వారు సూచించిన మిల్లర్స్ వద్ద ధాన్యాన్ని చేర్చాలంటున్నారనీ, 40, 30 కిలోమీటర్ల దూరం మిల్లర్ల వద్దకు చేర్చాలంటే రైతుకు భారం అవుతుందనీ, అయినప్పటికీ చేరుస్తున్నారనీ, ఇది చాలదన్నట్టు మూల్గే నక్కపై తాటికాయ పడ్డట్లు ఆన్లైన్లో ఆ రైతు పేరు చిలకలూరిపేట వస్తే చిలకలూరిపేట పిడుగురాళ్ల వస్తే పిడుగురాళ్ల , నరసరావుపేట వస్తే నరసరావుపేట చేర్చమనటం చాలా అన్యాయం అని అన్నారు. ఈ విషయం సంబంధిత అధికారులు పురాలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు.రైతులు పండించిన ధాన్యాన్ని ఆ నియోజకవర్గ పరిధి దాటి రైతుల్ని చేర్చమనటం చాలా అన్యాయమని అన్నారు. దీంతో సన్న చిన్నకారు రైతులు ఖర్చు భరించలేక దళారులకే తక్కువ ధరకు అమ్ముకుంటున్నారన్నారు.

కలెక్టర్ జోక్యం చేసుకొని రైతులకు ఇబ్బంది లేకుండా ఏ నియోజకవర్గంలో పండించిన వరి ధాన్యాన్ని ఆ మండల కేంద్రాల్లో లేక ఆ నియోజకవర్గ కేంద్రం వరకు మాత్రమే చేర్చే విధంగా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. మద్దికుంట అంకుల్ , పొట్లూరు వెంకటేశ్వర్లు, శ్రీను పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల విక్రయాన్ని నిషేధించాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: బాలలు చదువుకునే, నివసించే ప్రాంతాలలోని మెడికల్ షాపులలో, కిరాణా షాపులలో మాదక ద్రవ్యాలు బాలలకు విక్రయించడమును నిషేధించుటకు తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వేణుగోపాల రెడ్డి అధికారులను ఆదేశించారు. బాలల్లో మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా నిరోధంపై ఉమ్మడి కార్యాచరణ ప్రణాళికను అమలు చేయడం అను అంశముపై మంగళవారం కలెక్టరేట్ లోని వీసీ సమావేశ మందిరంలో అధికారులతో జరిగిన సమావేశము లో కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలలు మొదలగు ప్రాంతాలలోని మెడికల్ షాపులలో, కిరాణా షాపులలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. పాఠశాలల సమీపంలోని షాపులలో పొగాకు ఉత్పత్తుల విక్రయాలను పూర్తిగా నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. . ఎక్స్, హెచ్1 మందుల విక్రయాలను మెడికల్ షాపులలో ప్రత్యేకంగా రిజిస్టర్లు నిర్వహించేలా ఔషధ నియంత్రణ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలోని డీ ఎడిక్షన్ సెంటరులో బాలలకు ప్రత్యేకంగా వార్డు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో డీఆర్వో చంద్రశేఖరరావు, జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డా.హనుమంతరావు, తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు వైద్యారోగ్య శాఖలో అమలు జరుగుతున్న కార్యక్రమాలు ప్రభుత్వం ఆశించిన స్థాయిలో ఫలితాలు సాధించేలా జిల్లా స్థాయి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని క్షేత్ర స్థాయి అధికారుల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన సూచనలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్ లోని వీసీ సమావేశ మందిరంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టరు విధానం, ఎన్సీడీ సర్వే, ఎనీమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో రక్త పరీక్షలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తుల ఆరోగ్య పర్యవేక్షణ తదితర కార్యక్రమాలు నిర్దేశించిన లక్ష్యాలు అధిగమించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎఎన్ఎం ల పనితీరును పర్యవేక్షించి, ఆశించిన స్థాయిలో పురోగతి లేని ప్రాంతాలను జిల్లా స్థాయి అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి, ఉద్యోగులు పనితీరు మెరుగుపర్చుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో నిర్మాణం పూర్తి అయిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను వారంలోపు ప్రారంభించి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్ఓ డా. హనుమంతరావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా. ప్రభావతి, ఎన్సీడీ పీడీ డా. శ్రావణ బాబు, డీఐఓ డా. కెవీ సుబ్బరాయన్, డీపీఎం డా. రత్నమన్ మోహన్, డా. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ డా.జయరామకృష్ణ, డీఎంఓ డా. సుబ్బరాయన్, ఏపీఎంఐడీసీ ఈఈ శ్రీధర ప్రసాదు, మెడికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై ప్రణాళికలు సిద్ధం

విశాలాంధ్ర-శావల్యాపురం: ఉపాధి హామీ పథకం ద్వారా గుర్తించిన పనులకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు ఎంపిడివో పేరుమీన శీతారామయ్య తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం 2023-24 సంవత్సరంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఉపాధి కూలీలకు పనులు కల్పించడానికి, పని దినాలను పెంచడానికి చేపట్టవలసిన చెరువుల పూడిక తీతలు, ఉద్యానవన పంటల సాగు, నీటి కుంటలు ఏర్పాటు, కందకాలు తీయడం, కాలువ పుడికతీత తదితర పనులను క్షేత్రస్థాయి సిబ్బంది గుర్తించి ఎంపిక చేయడం జరిగిందన్నారు. వారు ఎంపిక చేసిన పనులను పంచాయతీల వారీగా గ్రామసభలు నిర్వహించి పనులను ఆమోదించినట్లు తెలిపారు. మండలంలోని 15 పంచాయతీలలో మొత్తం 312 పనులను గాను 9 కోట్ల 90 లక్షల విలువైన పనులకు అంచనాలు సిద్ధం చేసి ఈనె 5వ తేదిన ఎంపిపి ముండ్లమూరి సుహాసిని అనిల్ కుమార్ అధ్యక్షతన జరిగిన మండల స్థాయి సమావేశంలో తీర్మానం చేసి జిల్లా కలెక్టర్ పరిపాలన అమోదం కొరకు పంపినట్లు ఎంపిడివో తెలిపారు. ఆయనతో పాటు ఎపిఓ ఎంవివి రాజు, ఈసి సుధాకర్, టిఏ సుబ్బారావు, సిఓ గుప్తా ఉన్నారు.

ముటేషన్ల పనులు పూర్తి చేయాలి

విశాలాంధ్ర-నరసరావుపేట: జిల్లాలోని 37 గ్రామాలలో జగనన్న భూ హక్కు పత్రాలకు సంబంధించి 74శాతం ఈ -కేవైసీ నేటికీ పూర్తి అయిందని మరో మూడు నాలుగు రోజుల లోపల 100శాతం పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక నరసరావుపేట కలెక్టర్ కార్యాలయంలోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్ నుండి మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 27 గ్రామాలలో ముటేషన్లకు సంబంధించి పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. భూపంపిణీకి సంబంధించి అసైన్మెంట్ ల్యాండ్లు గుర్తింపు జనవరి-2023 నెలాఖరు నాటికి పూర్తి చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీల శ్మశాన వాటికల పనులను వేగవంతం చేయాలన్నారు.

సచివాలయంలో 'స్పందన' నిర్వహించాలి

విశాలాంధ్ర-నరసరావుపేట: సచివాలయంలో ప్రతిరోజు మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఐదు గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించాలని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్ సచివాలయ సిబ్బందికి సూచించారు. రావిపాడు-1, నరసరావుపేట అర్బన్ పరిధిలోని చాకిరాల మిట్ట, 32, 33, 34 సచివాలయాలను మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ సచివాలయంలో అందిస్తున్న సేవలను పకడ్బందీగా అందించాలని అన్నారు. తడి చెత్త పొడి చెత్త వేరు చేసే విధంగా ప్రజలలో అవగాహన కల్పించి పరిశుభ్రతను పెంపొందించేలా చర్యలు చేపట్టాలన్నారు. చాకిరాల మిట్ట సచివాలయ పరిధిలో ఒకరికి డెంగ్యూ ఫీవర్ రావడం గుర్తించి ఆ పరిసర ప్రాంతాలలో ప్రజలకు అవగాహన కల్పించారు. డెంగ్యూ ఫీవర్ ప్రబలకుండా ఉండేలా చూడాలని తదనుగుణంగా శానిటేషన్ పనులను చేపట్టాలన్నారు. నరసరావుపేట అర్బన్ ప్రాంతంలోని సచివాలయాల పరిధిలో అక్రమ నిర్మాణాలను నివారించాలని ఇంటి ప్లాన్ అప్రూవల్ విధిగా ఉండేలా చూడాలన్నారు. అక్రమ నిర్మాణాలపై అవసరమైన చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బందికి ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి రమణ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో అవినీతిపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-చిలకలూరిపేట: మునిసిపాలిటీలో జరుగుతున్న అవినీతి గురించి తగిన చర్యలు తీసుకోవాలని మంగళవారం ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కమిషనర్ , డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ కు నవతరంపార్టీ జాతీయ అధ్యక్షుడు రావుసుబ్రహ్మణ్యం మెమోరాండం అందజేశారు. లక్షలాది రూపాయలు బిల్లులు తప్పుడు దస్త్రాలు పెట్టి డ్రా చేస్తున్నారు అని ప్రజా ధనాన్ని అధికారులు తప్పుడు విధానంలో బిల్లులు చేసుకుని అవినీతికి పాల్పడ్డారని మునిసిపల్ డైరెక్టర్ కు వివరించారు.సంబంధించిన వివరాలు ఆధారాలతో అందించారు.తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. లేఖ వివరాలు మీడియా కు విడుదల చేసారు. చిలకలూరి పేట పురపాలక సంఘంలో అవినీతి, నిధుల విడుదల విచారణ జరిగాలని కోరారు.

రామకిషన్ సింగ్ సేవలు అభినందనీయం



విశాలాంధ్ర:శావల్యాపురం: మండలంలోని బొందిలిపాలెం, శానంపూడి, మతుకుమల్లి గ్రామాలలోని ఎంతోమంది విద్యార్థులకు ఉన్నతమైన విద్యాబోధనను అందించి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసిన సీనియర్ ఉపాధ్యాయులు, విద్యా ప్రదాత కాహేటి రామకిషన్ సింగ్ సేవలు అభినందనీయమని కోర్ కమిటీ సభ్యులు పాపసాని వెంకటేశ్వర్లు అన్నారు. బొందిలిపాలెం గ్రామంలోని శ్రీఅడవి పేరంటాలమ్మ సేవాసమితి ఆధ్వర్యంలో రామకిషన్ సింగ్ ను దుశ్శాలువాలు, పూల మాలలతో మంగళవారం ఘనంగా సన్మానించారు. కోర్ కమిటీ సభ్యులు చల్లగుండ్ల రమేష్ బాబు మాట్లాడుతూ రామకిషన్ సింగ్ గత 35 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించారని, క్రీడలలో కూడా విద్యార్థులను తీర్చిదిద్దారని అన్నారు. ఆయన వద్ద చదువు కొన్న విద్యార్థులు ఉద్యోగరీత్యా దేశ, విదేశాలలో స్థిరపడి అభివృద్ధిపథంలో పయనిస్తున్నారని, సమాజాభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తున్నారని ప్రశంసించారు. అడవి పేరంటాలమ్మ వాటర్ ప్లాంట్ నిర్వాహకుడు పచ్చవ అఖిల్ ని దుశ్శాలువాలు ఘనంగా సత్కరించారు.

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి
కోర్టు : గురజాల
HMOP : 167/2021

బిట్వీన్ :
కతారి మణికంత - పిటీషనరు
మరియు
కతారి ఆదిలక్ష్మి - రెస్పాండెంటు

టు,
కతారి ఆదిలక్ష్మి భర్త మణికంత తండ్రి తెలగనేని జనార్థనరావు వయస్సు 27సం॥, హిందూ ఆర్/ఓ. డోర్ నెం.3-95-3, కారంపూడి గ్రామం & మండలం పల్నాడుజిల్లా

పై నెంబరులో విడాకుల కొరకు దాఖలు చేసిన పిటీషన్‌లో మీకు కోర్టువారు పలుమార్లు నోటీసు పంపినను, తీసుకొనక, కాలయాపన చేయుచున్నందున సదరు కోర్టువారు, ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు తెలియపరచమని ఆర్డరు వేసి ఉన్నారు. **ది.19-01-2023 న ఉదయం గం.10.30 ని॥లకు** పైన తెలిపిన కోర్టు నందు మీరు స్వయంగా గాని లేదా మీ ప్లీడరు ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియజేయ గలరు. అలా కాని యెడల, మీ పరోక్షమున, పిటీషనను (కేసు) తీర్మానించ బడునని తెలియజేయడమైనది.

వాయిదా తేది : 19-01-2023

కుందా ఏడుకొండలు
పి.బి.ఎస్. రాజు
17-1-23 ఎం. ప్రసాదరావు, అడ్వకేట్స్
పిడుగురాళ్ళ పిడుగురాళ్ళ

పద్యకవి, సాహితీవేత్త ఆలీ మృతి

నేడు లింగంగుంట్లలో అంత్యక్రియలు

షేక్ ఆలీ ఫైల్ ఫొటో

విశాలాంధ్ర-చిలకలూరిపేట : ఉమ్మడి గుంటూరు జిల్లాలో తొలి ముస్లిం తెలుగు పద్యకవి, తొలి తెలుగు ముస్లిం ఉపాధ్యాయుడు షేక్ ఆలీ(88) మంగళవారం చిలకలూరిపేట మండలంలోని లింగంగుంట్ల గ్రామంలో మధ్యాహ్నం మృతి చెందారు. పద్యం ద్వారా తెలుగు భాషను మరింత మధురం చేస్తూ ఎనిమిది పదులు వయస్సులోనూ తెలుగు భాషకు సేవ చేసిన అవిశ్రాంత కవి షేక్ ఆలీ. చిలకలూరిపేట మండలం లింగంగుంట్ల గ్రామానికి చెందిన షేక్ ఖాసింసాహెబ్, మస్తాన్‌బీ దంపతులకు 1935లో జన్మించిన షేక్ ఆలీ ప్రాథమిక విద్యాభ్యాసం అంతా చిలకలూరిపేటలోని ఆర్‌వీఎస్ సీవీఎస్ ఉన్నత పాఠశాలలో జరిగింది. ఉపాధ్యాయశిక్షణ పూర్తి చేసి 1954 నుంచి 1963 వరకు బొప్పుడి పాఠశాలలో సెకండరీ గ్రేడ్ అసిస్టెంట్ ఉపాధ్యాయునిగా, 1964 నుంచి 1973 వరకు బాపట్ల జిల్లా యద్దనపూడి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో తెలుగు పండిత్‌గా పనిచేశారు. ఉపాధ్యాయుడుగా పనిచేస్తునే ఎంఏ, బీఈడీ పూర్తి చేసి 1973 నుంచి 1984 వరకు కంబం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకుడుగా పదోన్నతిపై పనిచేశారు. 1993లో కొండెపి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా రిటైర్ అయ్యారు. బాల తెలుగు భాషపై మమకారాన్ని పంచుకున్న ఆయన పాఠశాలలో ఉన్న కవి జాస్తి వెంకటనరసయ్యను సాహితీ గురువుగా స్వీకరించి ఆయన సహకారంతో తెలుగు భాషలో ఉన్న అనేక గ్రంధాలను ఆకలింపు చేసుకున్నారు. తెలుగు మాట్లాడటమే అంతంత మాత్రంగా ఉన్న ఆ రోజుల్లో ముస్లిం అయి ఉండి తెలుగు పద్యాలను రాసి బేష్ అనిపించుకున్నారు. రాష్ట్రంలో తెలుగు భాషలో కావ్యాలు రాసిన ముస్లింలు అరుదు. పిఠాపురంకు చెందిన ఉమర్ ఆలీషా, అనంతపురంకు చెందిన పాపాసాహెబ్, కడపకు చెందిన బుడనాసాహెబ్ వంటి వారు మాత్రమే ఆ రోజుల్లో తెలుగులో పద్యాలు వ్రాసి కీర్తిని పొందారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని 1957లో మానస ప్రబోధం అనే పద్యకావ్యాన్ని రచించిన ఆయన అక్కడినుంచి గురుదక్షిణ, కోగంటివారి సాహితీసేవ, గురుని మాట, విధివిలాసం, అజీంఖాన్ బాబా, వ్యాసమంజరి, షిర్డి సాయిబాబా శతకము, శ్రీహజరత్ ఖాదర్ వలి శతకము, శ్రీచెన్నకేశవ శతకము, ఆకాశవాణి, సిలువధారి, శ్రీవాసవీకన్యక, ఇందిరాభారతం లాంటి ఎన్నో పుస్తకాలతో పాటు ప్రముఖ కవి నాగభైరవ కోటేశ్వరరావు స్మృతి సంచికగా నాగభైరవం రచించి మన్ననలు పొందారు. ఆయన చేసిన సాహితీ సేవకు అనేక బహుమతులు, అవార్డులు, సన్మానాలు పొందారు. 1978లో ప్రకాశం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా, 1988లో రాష్ట్రప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డులు పొందారు. 1985లో ఏలూరు కాట్రగడ్డ సాహితీ పురస్కారం, 2002 విజయనగరం శ్రీపట్నాయకుని నరసింహం ఫౌండేషన్ పురస్కారాలు అందుకున్నారు. వయస్సు రీత్యా అనేక అవార్డులు, సన్మానాలకు దురంగా ఉంటున్న ఆయన ఇటీవలే ఆయన గురించి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తెలుగు భాషాభిమానులు, విమర్శకులు పేర్కొన్న అభిప్రాయాలతో శతక సౌరభాలు-కావ్యకాంతులు అన్న గ్రంధాన్ని ఆవిష్కరించారు. ఇందులో నాగభైరవ కోటేశ్వరరావు, ఎమ్మెల్సీ లక్షణరావు లాంటి ప్రముఖుల అభిప్రాయాలతో పాటు రసరాజు, షేక్ దావూద్, శంకరనారాయణ, డాక్టర్ పీవీ సుబ్బారావుల లాంటి 100 పైచిలుకు అభిప్రాయాలు ఆలీ సంపూర్ణ సాహితీ వ్యక్తిత్వాన్ని ప్రతిభింబించాయి. ఆయన మృతి పట్ల పలువురు సాహితీ వేత్తలు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. బుధవారం స్వగ్రామంలోని లింగంగుంట్లలో ఆలీ అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

సైకిల్ రావాలి... సైకో పోవాలి...

విశాలాంధ్ర-తాడికొండ : సైకిల్ రావాలి... సైకో పోవాలని టీడీపీ రాష్ట్ర సాధికార సమితి అధ్యక్షులు దూళిపాళ్ల ఏసుబాబు కోరారు. ఈ నెల 27న నారా లోకేష్ పాదయాత్ర చేపడుతున్న నేపథ్యంలో పాదయాత్ర విజయవంతం కావాలని కోరుతూ మండల కేంద్రమైన తాడికొండలో మంగళవారం టీడీపీ ఆధ్వర్యంలో సంఘీభావంగా పాదయాత్ర కొనసాగించారు. మండలంలో నేడు ఎన్టీఆర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బండ్ల కోటేశ్వరరావు, మొగిలి గోపి, హనీషా, కొలికిపూడి బుల్లయ్య, పెద్దబ్బాయి, త్రిపురనేని అప్పారావు, అంజయ్య పాల్గొన్నారు.

శరద్ యాదవ్, కేవీ రెడ్డయ్యకు నివాళి



విశాలాంధ్ర-దుగ్గిరాల : మండల కేంద్రమైన దుగ్గిరాల గ్రామంలోని శివాలయం సెంటర్‌లో మంగళవారం మాజీ కేంద్ర మంత్రి, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి శరద్ యాదవ్, మాజీ ఉయ్యూరు శాసనసభ, మాజీ బందరు పార్లమెంటు సభ్యులు కేవీ రెడ్డయ్య యాదవ్ అకాల మరణము చెందినందుకు దుగ్గిరాల గ్రామ యాదవ సంఘము ఆధ్వర్యంలో శ్రద్ధాంజలి ఘటించారు. రామస్వామి యాదవ్ మాట్లాడుతూ శరద్ యాదవ్ గొప్ప లౌకికవాది అని, నిరంతరము బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసినటువంటివాడని అన్నారు.ఆయన ఏడు సార్లు లోక్‌సభకు, మూడు సార్లు రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించారని అన్నారు. అలాగే కేవీ రెడ్డయ్య పార్లమెంటు సభ్యునిగా పార్లమెంటులో మండల కమీషన్ రిపోర్టు అమలు చేయాలని ప్రైవేటు బిల్లు పెట్టినటువంటి గొప్ప బీసీ నాయకుడని అన్నారు. నల్లనూకల వెంకటేశ్వరరావు, కుర్రా నాగయ్య, వెంకట నారాయణ, పాములు, పసుపులేటి నాగేశ్వరరావు, రాంమోహన్ రావు, చెన్ను కృష్ణప్రసాదు, నరసింహారావు, దేవయ్య, కోటేశ్వరరావు, గుమ్మా కోటయ్య, నిషాద్ పాల్గొన్నారు.

సౌత్ ఇండియన్ బ్యాంక్
Experience Next Generation Banking
గుంటూరు బ్రాంచి, డోర్ నెం.4-1-1, గాయత్రి ప్లాజా, కొరిటెపాడు మెయిన్‌రోడ్, గుంటూరు. ఫోన్ : 0863-2245655
ఇ-మెయిల్ : br0378@sib.co.in

బ్యాంక్ వద్ద తనఖా వుంచిన బంగారు నగల వేలము నోటీసు

ఇందుమూలముగా తెలియజేయుట ఏమనగా అధీకృత అధికారి ది సౌత్ ఇండియన్ బ్యాంక్ లిమిటెడ్ బంగారు నగలు తాకట్టు పెట్టి తీసుకున్న రుణములు ఋణగ్రహీతలకు ఎన్ని నోటీసులు జారీచేసినను దిగువ తెలిపినవారు తమ బాకీలను చెల్లించియుండలేదు. రుణము చెల్లించవలసిన కాలము గతించినందున సదరు బంగారు నగలను ది.21-01-2023, శనివారం మధ్యాహ్నం 12-00 గం॥ల నుండి 3-00 గం॥ల వరకు మా బ్రాంచి ఆవరణలో ఆన్‌లైన్ వేలం ద్వారా "ఎక్కడ ఏమి ఉన్నదో అక్కడ అది" "ఎక్కడ ఎలా ఉన్నదో అక్కడ అలా" "ప్రశ్నించుటకు వీలులేని" అను ప్రాతిపదికన & https://egold.auctiontiger.net ద్వారా నిర్వహించబడును.

గోల్డ్ లోన్ నెం.	ఖాతాదారుని పేరు
0378653000026982, 0378653000026985	బోడా శ్రీనివాస్

మరింత సమాచారం కొరకు ఆక్షన్ టైగర్ 6359575981/9023724780 ను సంప్రదించగలరు.
మేనేజర్, ది సౌత్ ఇండియన్ బ్యాంక్ లిమిటెడ్

CHANGE OF NAME

I, **SRIRAM VISALAKSHMI** W/o. **SRIRAM VENKATA SUBBAIAH**, R/o. D.No. 3-31/7, Pasumarru Village, Chilakaluripet Mandal, Palnadu District - 522616, A.P. have changed my husband's name from **SREERAM VENKATA SUBBAIAH** to **SRIRAM VENKATA SUBBAIAH**. Hereafter my husband's name is known as **SRIRAM VENKATA SUBBAIAH**.

CHANGE OF NAME

I, **RASHEEDA BEGUM** (Old Name) W/o. **MOHAMMED KHAJA KHALEELUR REHMAN**, R/o. H.No.7-19-160/32/5, Near Saibaba Temple, Mallikarjunapet 5/4 Lane, Guntur - 522002, Guntur District, A.P., have changed my name to **SHAIK RASHEEDA BEGUM**. Hereafter my name is known as **SHAIK RASHEEDA BEGUM**.